ప్రజాశక్తి

మంగళవారం 25 జులై 2023 5

పార్వతీపురం మన్యం



'జగనన్నకు చెబుదాం'కు 106 అర్జీలు

ప్రజాశక్తి - కలెక్టరేట్

కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే జగనన్నకు చెబుతాం కార్యక్రమంలో ప్రజల నుంచి సామాజిక, వ్యక్తిగత సమస్యలపై 106 అర్జీలు అందాయి. సోమవారం కలెక్టరు కార్యాలయంలో జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో సంయుక్త కలెక్టరు ఆర్.గోవిందరావు, డిఆర్ఒ జె.వెంకటరావుతో కలిసి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ప్రజలు ఇచ్చిన అర్జీల పరిష్కారం నిమిత్తం సంబంధిత జిల్లా అధికారులతో నేరుగాను, మండల అధికారులతో వీడియో ద్వారా మాట్లాడి పరిష్కారానికి ఆదేశాలు జారీచేశారు. సామాజిక, వ్యక్తిగత సమస్యలపై అర్జీలు అందజేసిన ప్రజలతో అధికారులు నేరుగా మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని, పరిష్కారం అర్జీదారు సంతృప్తిచెందేలాఉండాలని, సమస్యల పరిష్కారంలో నాణ్యత ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లాలోని అన్నిశాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మణిపూర్ సిఎంను బర్తరఫ్ చేయాలి

ప్రజాశక్తి -కలెక్టరేట్

మణిపూర్‌లో ఇద్దరు గిరిజన మహిళలను నగ్నంగా ఊరేగించి, అత్యాచారం చేసి చంపి వేసిన వారిని వెంటనే శిక్షించాలని, మణిపూర్‌లోనూ, కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి హింసకు కారణం కాబట్టి వెంటనే మణిపూర్ సిఎం. బీరెన్‌సింగ్‌ను బర్తరఫ్ చేయాలని వామపక్షాలు డిమాండ్ చేస్తూ నిరసన ర్యాలీ చేపట్టాయి. మణిపూర్ మారణహోమానికి నిరసనగా వామపక్షాల ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుండి బెలగాం వరకు వెళ్లి తిరిగి అంబేద్కర్ బొమ్మ వరకు వచ్చి నిరసన తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు అధ్యక్షతన జరిగిన ర్యాలీలో సిపిఎం, సిపిఐ ఎంఎల్, లిబరేషన్ న్యూ డెమోక్రసీ సంఘాల నాయకులు మాట్లాడుతూ మణిపూర్‌లో కుకి తెగ ఆదివాసి గిరిజనులు జీవిస్తున్నారని, బిజెపి ప్రభుత్వం అభివృద్ధి చెందిన మెజార్టీ కులమైన మైతే తెగను ఎస్టీ జాబితాలో చేర్చాలని నిర్ణయం తీసుకోవడంతో అక్కడ హింస చెలరేగిందని అన్నారు. కుకీ, నాగ తెగలను కొండలు నుంచి తరిమేసి విలువైన అటవీ సంపద, ఖనిజాలు, గనులను కార్పొరేట్లకు అప్ప చెప్పడంలో భాగమేనని విమర్శించారు. బిజెపి దేశ వ్యాప్తంగా తను అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో దళితులకు, గిరిజనులకు, ముస్లిం, క్రిస్టియన్లకు, మహిళలకు రక్షణ లేదన్నారు. ఇంత దుర్మార్గం జరుగుతున్నా మనరాష్ట్రంలో వైసిపి, టిడిపి, జనసేన బిజెపికి వంత పాడడం తప్ప మణిపూర్ ఘటనను ఖండించడంలేదన్నారు. ఇప్పటికైనా మణిపూర్ హింసపై పార్లమెంటులో అన్ని పార్టీలు చర్చించి హింసను కేంద్ర ప్రభుత్వం ఆపాలని డిమాండ్ చేశారు. మహిళాపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. ఈ చర్యను ప్రజలంతా ఖండించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఇందిర, ఆర్.శ్రీదేవి, యమ్మల మన్మధరావు, పాకల సన్యాసిరావు, బంటు దాసు, రామ, జి.వెంకటరమణ, ఉమా, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు భాస్కరరావు, కృష్ణవేణి, న్యూ డెమోక్రసీ నాయకులు పి రమణ, బొచ్చ నర్సింగరావు, లిబరేషన్ గ్రామీణ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సంఘం, గిరిజన సంక్షేమ సంఘం నాయకులు



సీతంపేటలో ర్యాలీ చేస్తున్న గిరిజనులు

వామపక్షాల డిమాండ్



పార్వతీపురం లో నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు

రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్డివానివలసలో కొవ్వొత్తుల ప్రదర్శన

సీతానగరం : మణిపూర్‌లో మహిళలపై జరిగిన దాడులకు నిరసనగా మండలంలోని రెడ్డివానివలసలో సిపిఎం ఆధ్వర్యాన కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు మాట్లాడుతూ బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ మతఘర్షణలు సృష్టించి గిరిజనులను, గిరిజనేతరుల మధ్య చిచ్చుపెడుతున్నారన్నారు. దాడులు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిళా సంఘం నాయకులు ఆర్.లక్ష్మి, ఆర్.మణి తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట : మణిపూర్ మారణహోమం ఆపాలని, శాంతిని నెలకొల్పాలని, మహిళల్ని నగ్నంగా ఊరేగించిన ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలను కఠినంగా శిక్షించాలని, మహిళలకు రక్షణ కల్పించలేని ప్రభుత్వాలు గద్దె దించాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో గిరిజన సంఘం కార్యాలయంలో నుంచి కాంప్లెక్స్ వరకు ర్యాలీ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసనకు ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.లక్ష్మణరావు నాయకులు ఎం.తిరుపతిరావు, మండల అధ్యక్ష కార్యదర్శులు జె.శ్రీరాములు, బి.సాయి, సీనియర్ నాయకులు, గిరిజనులు పాల్గొన్నారు.

పాలకొండ రూరల్: మణిపూర్‌లో మహిళలు పైన జరుగుతున్న హత్యలు, అత్యాచారాలు, మానభంగాలను పాల్పడుతున్న సంఘవిద్రోహ శక్తులు పైన వెంటనే చర్యలు తీసుకోవాలని సిఐటియు మండల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో పాలకొండలో సమావేశం జరిగింది. ఈ సమావేశాన్ని ఉద్దేశించి మండల సమన్వయ కమిటీ అధ్యక్షులు బి.అమరేవతి మాట్లాడారు. మణిపూర్‌లో మహిళలపై దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ,లేనియెడల భవిష్యత్తులో పెద్ద ఎత్తున రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు కాదా రాము, అర్ధమూడి లక్ష్మణరావు, మజ్జి వీరంనాయుడు, పి.లక్ష్మీ, చిట్టెమ్మ, చింతల సంజీవి, వేణు, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణాలు పూర్తిచేయండి

గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే

ప్రజాశక్తి - పాచిపెంట/సాలూరు

పాఠశాల భవనాలు త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే ఆదేశించారు. సోమవారం జిల్లా పర్యటనకు విచ్చేసిన ముఖ్య కార్యదర్శి పాచిపెంట మండలం గురువునాయుడుపేటలో నిర్మాణంలో ఉన్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల భవనాలు, పాచిపెంటలో గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలకు కల్పిస్తున్న అదనపు వసతులను, సాలూరు మండలం మామిడిపల్లిలో గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల భవనాలు, మక్కువ మండలం అనసభద్రలో నిర్మాణంలో ఉన్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల భవనాలు పరిశీలించారు. నిర్మాణాల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. భవన నిర్మాణాలు వేగవంతం చేయాలని గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆగష్టులో ఒకటి, అక్టోబరులో ఒకటి, మిగిలినవి మరో రెండు నెలల్లో పూర్తి చేస్తామని ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. మామిడిపల్లిలో గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల భవనాల నిర్మాణం దీర్ఘకాలంగా కొనసాగడం పట్ల వివరణ అడిగారు. కార్యక్రమంలో పార్వతీపురం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి. విష్ణు చరణ్, గిరిజన సంక్షేమ శాఖ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్, కార్యనిర్వాహక ఇంజనీర్ జె. శాంతీశ్వర రావు, జిల్లా గిరిజన సంక్షేమశాఖ డిడి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

మక్కువ : మండలంలోని అనసభద్రలో నిర్మాణంలో ఉన్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల భవనాలను కాంతిలాల్ దండే పరిశీలించారు. నిర్మాణాల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. భవన నిర్మాణాలు వేగవంతం చేయాలని గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

కురుపాం : స్థానికంగా రూ.12కోట్లుతో జరుగుతున్న ఏకలవ్య పాఠశాల భవన నిర్మణాలు ను గిరిజన సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి కాంతీలాల్ దండే పరిశీలించారు. ఈసందర్భంగా భవన నమూనా ,మౌలిక వసతులు ఏర్పాటు ,అదనపు సౌకర్యాలు కల్పించాలని గిరిజన సంక్షేమ ఈఎన్ సి ఎస్. శ్రీనివాస్ కు సూచించారు. అనంతరం గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో నాబార్డు నిధులు కోటీ తొంబై లక్షలతో అర్ధాంతరంగా నిలిచిపోయిన అదనపు తరగతి గదులు పరిశీలించి అందుకు గలకారణాలు అడిగి తెలుసుకున్నారు. ఇఎన్‌సి సమాధానం ఇస్తూ ఇంజనీరింగ్ అధికారులు పూర్తి చేసిన పనులకు సకాలంలో బిల్లు పెట్టడంలో నిర్లక్ష్యంగా ఉండడం వల్ల నిధులు విడుదల కాలేదన్నారు. అనంతరం రూ.5కోట్లు నిధులతో ప్రారంభమై పునాది స్థాయిలో ఆగిపోయిన డైనింగ్ బ్లాక్ పనులు పరిశీలించారు. బాలికల గురుకులంలో సమస్యలు ప్రిన్సిపల్ సత్యవతిని అడిగి తెలుసుకున్నారు. డైనింగ్ బ్లాక్ నిర్మాణం పూర్తి చేసేందుకు అవసరమైన నిధులను విడుదల చేయాలని పిఒ విష్ణుచరణ్ కు సూచించారు. ప్రస్తుతం వినియోగం లో ఉన్న డైనింగ్ హాల్ పరిశీలించి డైనింగ్ టేబుల్స్ ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ అధికారులు కు ఆదేశించారు.



మ్యాప్‌ను పరిశీలిస్తున్న గిరిజన సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి కాంతిలాల్ దండే

దండే సారు ఇలా వచ్చారు.. అలా వెళ్లారు..

సాలూరు: గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే సుడిగాలి పర్యటనలో భాగంగా సోమవారం సాయంత్రం మండలం లోని మామిడిపల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల భవన నిర్మాణ పనులు పరిశీలించారు. సాయంత్రం నాలుగు గంటల కు వచ్చిన ఆయన కారు దిగకుండానే దూరం నుంచి అసంపూర్తిగా వదిలేసిన భవన నిర్మాణాన్ని చూశారు. గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ చూపించిన మ్యాప్ పరిశీలించి వెనుదిరిగారు. ఏళ్లతరబడి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల నూతన భవన నిర్మాణం నిలిచిపోయింది. వర్షాకాలంలో ప్రస్తుతం నడుస్తున్న పాఠశాల లో విద్యార్థినులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నేడు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి రాక

పార్వతీపురం :జిల్లా ఇన్ ఛార్జ్ మంత్రి, రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి గుడివాడ అమర్నాధ్ మంగళ వారం జిల్లాకు వస్తున్నట్లు కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగే సాలూరు, పార్వతీపురం నియోజకవర్గ స్థాయి సమావేశాల్లో మంత్రి పాల్గొంటారని ఆయన చెప్పారు. మంగళ వారం ఉదయం 10 గంటలకు సాలూరు నియోజకవర్గ స్థాయి సమావేశం జరుగుతుందని ఆయన తెలిపారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్న దొర కూడా హాజరు అవుతారని ఆయన పేర్కొన్నారు.

ఓటరు ధ్రువీకరణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి -పార్వతీపురం

ప్రత్యేక ఓటరు జాబితా పునశ్చరణ కార్యక్రమంలో అధికారులు ఎవరైనా నిర్లక్ష్యంగా పనిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టరు నిశాంత్ కుమార్ హెచ్చరించారు. జిల్లాలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలపై మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సోమవారం కలెక్టరు కార్యాలయం నుండి సమీక్షించారు. ఈ సమీక్ష కార్యక్రమంలో ప్రత్యేక ఓటరు జాబితా పునశ్చరణ, హౌసింగు, నరేగా, ప్రాధాన్యత భవనాలు నిర్మాణం, రీసర్వే, గడపగడపకు మన ప్రభుత్వం, జగనన్నకు చెబుదాం, జగనన్న సురక్ష తదితర పథకాలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టరు మాట్లాడుతూ ఓటరు నమోదు కార్యక్రమం సక్రమంగా నిర్వహించాలని, అధికారులు ఎవరి విధులను వారు ఖచ్చితంగా నిర్వర్తించాలని, ఎక్కడైనా అధికారులు సక్రమంగా పనిచేయలేదని ఫిర్యాదులొస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, విధుల్లో అలక్ష్యం వహించిన బిఎల్ఒలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బూత్ స్థాయి అధికారులతో ఇంటింటా ఓటరు వివరాల విచారణ నిర్వహించాలని తెలిపారు. మున్సిపాలిటీల పరిధిలో ఇళ్ల నిర్మాణం పనుల్లో దశల వారీ పురోగతి 50శాతం మించడంలేదని, లే అవుట్లలో కరెంటు, నీటి సదుపాయాలను కల్పించి నిర్మాణ పనులు వేగవంతం చేసి, ప్రభుత్వం నిర్దేశించిన గడువులోపల పూర్తిచేయాలని తెలిపారు. నరేగా పనుల్లో మొక్కలు నాటే కార్యక్రమానికి ప్రాధాన్యత ఇవ్వాలని, వర్షాలు పడుతున్నందున గోతులు తీసి నెలాఖరునాటికి మొక్కలు నాటడం పూర్తిచేయాల న్నారు. ముఖ్యంగా విలేజ్ హెల్త్ క్లినిక్స్ భవనాలు నూరుశాతం పూర్తిచేయాల న్నారు. రీసర్వే పనులను సకాలంలో పూర్తిచేయాలని తెలిపారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరైన పనులన్నింటిని పూర్తిచేసి, బిల్లులను వెంటనే చెల్లింపులు నిమిత్తంరికార్డు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో జెసి ఆర్.గోవిందరావు, డిఆర్ఒ జె.వెంకటరావు, డ్వామా పీడీ కె.రామ చంద్ర రావు, డిపిఒ బలివాడ సత్యనారాయణ, ఐసిడిఎస్ కె.విజయగౌరి, జిల్లా సర్వే సెటిల్మెంట్ అధికారి కె. రాజకుమార్ పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

బిఎల్‌ఒ సస్పెన్షన్

పాలకొండ :ఓటరు నమోదు కార్యక్రమంలో విధుల్లో అలక్ష్యం వహించిన బూత్ స్థాయి అధికారి (బి.ఎల్.ఒ)ని సస్పెన్షన్ చేస్తూ జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. పట్టణంలోని బాసూరువారివీధి సచివాలయంలో వార్డు పారిశుధ్య, పర్యావరణ కార్యదర్శిగా పనిచేస్తున్న హేమంత్ కుమార్‌ను 168 పోలింగ్ కేంద్రం బిఎల్‌ఒగా నియమించారు. 2024 సంవత్సరానికి జరుగుతున్న ప్రత్యేక ఓటరు పునశ్చరణ కార్యక్రమం (స్పెషల్ సమ్మరీ రివిజన్ 2024)లో అనేక సార్లు ఆదేశించినప్పటికి విధులకు హాజరు కాకపోవడం, కనీసం ఫోను చేసినా స్పందించక అలక్ష్యం వహిస్తూ అత్యంత ప్రాధాన్యత కలిగిన ఓటరు నమోదు కార్యక్రమానికి విఘాతం కలిగిస్తున్నట్లు ఆధారాల అనుగుణంగా సస్పెన్షన్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సస్పెన్షన్ కాలంలో అనుమతి లేకుండా ప్రధాన కేంద్రాన్ని విడిచి వెళ్లరాదని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.



ల్యాబ్‌ను పరిశీలిస్తున్న డిఐఒ జగన్మోహనరావు

ప్రయివేట్ ఆస్పత్రులు తనిఖీ

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

పట్టణంలోని పలు ప్రైవేట్ ఆసుపత్రుల తనిఖీలో భాగంగా వాటి పని తీరును జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు తన వైద్య బృందంతో కలిసి సోమవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ మేరకు ఆయన శ్రీ చిన్నబాబు మదర్, చైల్డ్ కేర్ ఆసుపత్రి, శ్రీ గాయత్రి చిల్డ్రన్ కేర్ క్లినిక్, డాక్టర్ మాధవరావు క్లినిక్, శ్రీ మణికంఠ లాబొరేటరీలో రోజువారీ నిర్వహిస్తున్న ఒపి రికార్డులు, లాబ్ నిర్వహణ, మందులు నిర్వహణ రికార్డులు, మరుగుదొడ్ల నిర్వహణను పరిశీలించారు. స్కానింగ్ యంత్రాలను పరిశీలించారు. బయోమెడికల్ వేస్ట్ నిర్వహణ పక్కాగా ఉండాలని, చేతుల పరిశుభ్రత, పిల్లలు, గర్భిణీలు, రోగుల ఆరోగ్య జాగ్రత్తలను సూచించే పోస్టర్లు విధిగా ఉంచాలని, ఒపి రికార్డుల వివరాలు స్పష్టంగా ఉండాలని ఆదేశించారు. అలాగే అగ్ని నిరోధక భద్రత పరికరాలు సరైన ప్రదేశంలో ఉంచాలన్నారు. నోటిఫైడ్ వ్యాధులు గుర్తించిన వెంటనే వైద్య శాఖ సూచించిన ఐహెచ్‌ఐపి పోర్టల్‌లో తక్షణమే నమోదు చేయాలన్నారు. అలాగే అక్కడి రోగులతో జగన్మోహనరావు ముఖాముఖిగా మాట్లాడి ఏ అనారోగ్య సమస్యలతో వచ్చారో అడిగి తెలుసుకొని ప్రిస్క్రిప్షన్ పరిశీలించారు. అనంతరం 4వ వార్డులో సీజనల్ వ్యాధుల దృష్ట్యా వైద్య సిబ్బంది నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డెమో వై. యోగీశ్వరరెడ్డి, సూపర్ వైజర్ జయగౌడ్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గిరిజన ఉత్సవాల్లో ఐటిడిఎకు ప్రథమ స్థానం

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

రాష్ట్రస్థాయి గిరిజన సాంస్కృతిక ఉత్సవాల్లో పార్వతీపురం ఐటిడిఎకు ప్రథమ స్థానం వచ్చింది. గుమ్మలక్ష్మీపురం ప్రాంతం నుంచి నేస్తం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో కళాకారులు ఉత్సవాలకు హాజరయ్యారు. గిరిజన సంస్కతి, సాంప్రదాయాలకు అనుగుణంగా ప్రతిబింబించేలా ఉత్సవాలు నిర్వహించారు.

జగనన్న సురక్షపై సర్వే

ప్రజాశకిత - సీతానగరం

మండలంలోని సూరంపేట సచివాలయ పరిధిలో సోమవారం జగనన్న సురక్షపై సర్వే కార్యక్రమాన్ని ఎంపిడిఒ ఎంఎస్ఎల్ఎన్ ప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఇంటికెళ్లి వచ్చిన సమస్యలను చేసుకొని జరగాలన్నారు. అలాగే గ్రామంలో నిర్మాణం జరుగుతున్న కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కెకె వర్మ, పంచాయతీ కార్యదర్శి సంతోష్ పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలతో పనులు చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

నాణ్యతా ప్రమాణాలు పాటించి నిర్మాణ పనులు పూర్తి చేయాలని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు సంబంధిత కాంట్రాక్టర్‌తో అన్నారు. పట్టణంలోని 28వ వార్డు చినదేవరవీధిలో 15వ ఆర్థిక సంఘ నిధుల నుంచి రూ.10లక్షలతో జరుగుతున్న సిసి కాలువ, రోడ్డు నిర్మాణ పనులను స్థానిక కౌన్సిలర్ మజ్జి శశికర్, ప్రజా ప్రతినిధులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పలు వార్డుల్లో సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి, పట్టణ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, కొరాడ శ్రీనివాసరావు (నాని), ఆర్.చిన్నంనాయుడు, కోఆప్షన్ సభ్యులు, ఎం.వెంకటరమణ, సీనియర్ నాయకులు రెడ్డి రవికుమార్, ఎస్‌విఎస్‌ఎన్ రెడ్డి, పి.శ్రీనివాసరావు, ఎస్.ప్రకాష్, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

తక్షణమే పాఠ్యపుస్తకాలివ్వాలి

అమ్మఒడితో పాఠ్యపుస్తకాలను ముడిపెట్టొద్దు

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన ఇంటర్ విద్యార్థులు కలెక్టరేట్ వద్ద దీక్షలు

ప్రజాశక్తి -కలెక్టరేట్

తక్షణమే తమకు పాఠ్యపుస్తకాలివ్వాలని, ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో గల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన ఇంటర్ విద్యార్థులు స్థానిక బెలగాం చర్చిసెంటర్లో సోమవారం 8గంటల నిరసన దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలను యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి తోట రమేష్ ప్రారంభించారు. ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి, శ్రామిక మహిళా సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వి. ఇందిరా ఈ దీక్షలకు సంఘీభావం తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కె.రాజు, సిహెచ్.సింహాచలం అధ్యక్షతన జరిగిన ఈ దీక్షల్లో వక్తలు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జూనియర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయట్లేదని, కనీసం చదువుకోవడానికి పాఠ్య పుస్తకాలు ఇవ్వడం లేదని అన్నారు. బోధనకు అధ్యాపకల్లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని విమర్శించారు. పుస్తకాలు ఇవ్వాలి, మధ్యాహ్నం భోజనం పెట్టాలని అడిగితే అమ్మఒడి ఇస్తున్నాం కదా అని విద్యాశాఖ మంత్రి సమాధానం చెప్పడం సరైంది కాదని, ఈ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. పథకాలకు పాఠ్యపుస్తకాలు ముండిపెట్టడం సరైంది కాదన్నారు. పుస్తకాల్లేకుండా పాఠాలు ఎలా కొనసాగుతాయని, విద్యార్థులు ఎలా ఉత్తీర్ణులవుతారని ప్రశ్నించారు. ఇప్పటికే ఈ సమస్యపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఇంటర్ బోర్డుని కలవడానికి వెళ్తే వారిని కనీసం కలిసే అవకాశం ఇవ్వకుండా నిర్దాక్షణంగా రోడ్లపై అరెస్ట్ చేయడం సిగ్గుమాలిన చర్యని విమర్శించారు. సమస్యలు పరిష్కరించమని విద్యార్థులు, విద్యార్థి నాయకులు పోరాటాలు చేస్తుంటే అవేవో గొంతెమ్మ కోరిక్కెల్లా ప్రభుత్వం స్పందించకుండా ప్రశ్నించే నాయకుల్ని, విద్యార్థుల్ని బెదిరించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. తక్షణమే ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలివ్వాలని, మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని, అదే సందర్భంలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులు, నాన్ టీచింగ్ స్టాఫ్ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. నిరసన దీక్షలో జూనియర్ కళాశాల నుంచి విద్యార్థిని విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : విద్యా రంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గుమ్మలక్ష్మీపురంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు కాలజీ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ధర్నానుద్దేశించి ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు ఎ.గంగారావు మాట్లాడుతూ జూనియర్ కళాశాలల ప్రారంభించి నెల రోజులు దాటిన పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయలేదన్నారు. షాపులు వద్ద పుస్తకాలు కొనాలంటే ఆర్థిక భారం అవుతుందన్నారు. విద్యార్థులు చదువుచున్న చోట కనీస సౌకర్యాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. నాడు నేడు పనులు పూర్తి చేయలేదని, అన్ని సబ్జెక్టులకు అధ్యాపకుల్లేరని ఆందోళన వ్యక్తం చేశారు. వసతి గృహాల్లో ఉంటున్న వందలాదిమంది విద్యార్థులకు మరుగుదొడ్లు, స్నానపు గదులు చాలడం లేదన్నారు. విద్యార్థులు ఆరు బయటకు వెళ్లి కాలకత్యాలు తీర్చుకుంటున్నారని అన్నారు. దీనివల్ల అనుకోని ప్రమాదాలు జరగవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. 400పైగా విద్యార్థులు ఉన్న వసతి గహాల్లో విద్యార్థులకు అనారోగ్యం వాటిల్లితే స్థానికంగా వైద్య సేవలు అందించేందుకు ఎఎన్ఎంను కూడా నియమించలేదన్నారు. పలుచోట్ల వార్డెన్లు ఎఎన్ఎంలను నియమించుకొని మందులు అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి ఎ.మహేష్, సభ్యులు సంతోష్, నవీన్ , రాము, విద్యార్థులు పాల్గొన్నారు.



దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లాఉపాధ్యక్షులు రాజు



గుమ్మలక్ష్మీపురం : తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న విద్యార్థులు

ఎంఎల్‌హెచ్‌పిలు ప్రధాన కేంద్రాల్లో ఉండాలి

ప్రజాశక్తి - పాలకొండ/ వీరఘట్టం

వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ ఎంఎల్‌హెచ్‌పిలు స్థానికంగానే నివాసం ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బగాది జగన్నాథరావు ఆదేశించారు. పాలకొండ మండలం కొండాపురం, వీరఘట్టం మండలం వండవలో వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌లను సోమవారం తనిఖీ చేశారు. ఎంఎల్‌హెచ్‌పిలు స్థానికంగానే నివాసం ఉండేలా సంబంధిత వైద్యాధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. స్థానిక నివాసం లేకపోతే సంబంధిత వైద్య అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హెల్త్ క్లినిక్ లకు సరఫరా చేసిన పరికరాలు, మందులు సక్రమంగా వినియోగించాలన్నారు. శాశ్వత భవనాలు అందుబాటు లో లేని గ్రామాల్లో అద్దె భవనాల్లో ఉండేందుకు అవకాశం కల్పించామని ఆయన అన్నారు. రానున్న మూడు నెలలు పూర్తి అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షాకాలంలో ప్రభలే వ్యాధులు, తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు. గ్రామాల్లో పారిశుధ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలన్నారు. గ్రామాల్లో జ్వరాల సర్వే నిర్వహించి, జ్వరాలున్నవారికి మాత్రలు అందించాలని, వైద్య సేవల పట్ల నమ్మకం పెంపొందించాలని హితవు పలికారు. గర్భిణీల సమాచారం విధిగా ఉండాలని, అందులో హైరిస్క్ గర్భిణీల వివరాలు స్పష్టంగా ఉండాలనిస్పష్టం చేశారు. సమయానుసారంగా వారికి తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని ఆయన ఆదేశించారు. ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు, ఇతర మందులు అందించాలని, పౌష్టిక ఆహారం కిట్లు పొందుతున్నది లేనిది ఆరా తీయాలని ఆయన చెప్పారు. సిబ్బంది స్థానికంగా చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు.

ఐటిఐలో రెండో విడత కౌన్సిలింగ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ప్రభుత్వ ఐటిఐలో ప్రవేశానికి రెండో విడత దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎం.గోపాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. iti.ap.gov.in వెబ్సైట్‌లో ఈనెల 31 లోగా దరఖాస్తు చేసుకొని, వెంటనే ఐటిఐ నందు వచ్చేనెల ఒకటో తేదీలోగా వెరిఫికేషన్ చేసుకోవాలని కోరారు. ఆగస్టు 3న కౌన్సిలింగ్‌కు హాజరు కావాలన్నారు. ఎలక్ట్రిషన్, ఫిట్టర్ మెకానికల్, మోటర్ వెల్డర్, కంప్యూటర్ కోర్స్, డ్రెస్ మేకింగ్ తదితర కోర్సుల్లో సీట్లు ఉన్నాయన్నారు. పదో తరగతి మార్కులు జాబితా, కుల ధ్రువీకరణ పత్రం, బదిలీ సర్టిఫికెట్, ఇడబ్ల్యూఎస్ సర్టిఫికెట్, ఆధార్ కార్డ్ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు.

రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మించాలి

ప్రజాశక్తి - బెలగాం

కొమరాడ మండలం స్వామినాయుడు వలస వద్ద రైలు పట్టాల అంతర్ బ్రిడ్జి నిర్మించి, రహదారి సౌకర్యం కల్పించాలని కోరుతూ సిపిఎం నాయకులు కె.సాంబమూర్తి ఆధ్వర్యాన గ్రామస్తులు కలెక్టర్ గ్రీవెన్స్‌లో జెసి గోవిందరావుకు, ఆర్‌డిఒ కె.హేమలతకు వినతిని అందజేశారు. దీంతో స్పందించిన జెసి ఆర్‌డిఒతో ఫోన్లో మాట్లాడి ఈ సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఆర్‌డిఒకు వినతిని ఇవ్వగా వెంటనే స్పందించి రైల్వే శాఖ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం సాంబమూర్తి మాట్లాడుతూ కొమరాడ మండలం గంగరేగివలస పంచాయతీ స్వామి నాయుడు వలసలో 300 కుటుంబాలు జీవిస్తున్నాయన్నారు. ఈ కుటుంబాల్లో ఎవరైనా చనిపోతే స్మశానానికి వెళ్లాలంటూ రెండు రైల్వే గేట్లు దాటాల్సి వస్తుందని, ప్రస్తుతం మరో గేటు తయారౌతుందని అన్నారు. దీంతో అనేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. కావున అంతర్ బ్రిడ్జి నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు జన్ని చిరంజీవులు, తదితరులు ఉన్నారు.

బిటి రోడ్డు పరిశీలన

ప్రజాశక్తి - కురుపాం
మండలంలోని జోగిరాజుపేట జంక్షన్ నుంచి కిచ్చాడ గ్రామానికి జరుగుతున్న బిటి రహదారి నిర్మాణ పనులను ఎంపిపి శెట్టి పద్మావతి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె కాంట్రాక్టర్ తో మాట్లాడుతూ రహదారి మన్ననలు పొందేలా ఎక్కడ కూడా నాణ్యత లోపాలు లేకుండా చూడాలని సూచించారు. అనంతరం కిచ్చాడకు చెందిన వైసిపి అభిమాని రెడ్డి నరసింహులు చనిపోయిన సంఘటన తెలుసుకొని ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని ధైర్యాన్ని ఇచ్చారు. కార్యక్రమంలో మన్యం జిల్లా గ్రీవెన్స్ అధ్యక్షులు శెట్టి నాగేశ్వరరావు, ఆయ్యరక కార్పొరేషన్ డైరెక్టర్ గవర విజయ చంద్ర శేఖర్ రావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బిఎల్ఒలతో కలిసి పని చేయాలి

ప్రజాశక్తి - సీతంపేట
బిఎల్ఒలతో కలిసి కార్యకర్తలంతా పని చేయాలని పాలకొండ నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ పిలుపునిచ్చారు. స్థానిక టిడిపి కార్యాలయంలో మండల నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఓటర్ల వెరిఫికేషన్, కొత్త ఓటు చేరిక, మరణాల ఓట్లు తొలగింపు, తప్పుడు ఓట్లు ధ్రువీకరణ, ప్రతి బూత్ బిఎల్ఒతో టిడిపి బిఎల్ఎ కలిసి పని చేయాలని జయకృష్ణ అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి బిడ్డిక చంద్రరావు, టిడిపి సీతంపేట మండల అధ్యక్షులు సవర తోట మొఖలింగం, సీనియర్ పార్టీ నాయకులు నిమ్మక నాగేశ్వరావు, సర్పంచ్ బిడ్డిక నీలయ్య, సీతంపేట మండల క్లస్టర్, యూనిట్, 103బూత్ బిఎల్ఎలు మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి డ్రాయింగ్ పోటీల్లో గిరిజన యువకుడి ప్రతిభ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం
రాష్ట్రస్థాయి ట్రైబల్ ఫెస్టివల్ సందర్భంగా విశాఖ లో నిర్వహించిన డ్రాయింగ్, పెయింటింగ్ పోటీల్లో మండలంలోని తాడికొండ గ్రామానికి చెందిన మండంగి బాలచంద్రుడు ప్రతిభ కనబరిచాడు. అద్భుతమైన చిత్రాలు గీసి రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం పొందాడు. అలాగే దురుబిలి గ్రామానికి చెందిన ఆరిక గౌతమ్ స్పెషల్ బహుమతి, కీసరగూడకు చెందిన ఆరిక సన్యాసిరావు కన్సలేషన్ బహుమతి పొందారు. ప్రథమ స్థానం బాలచంద్రుడుకి ప్రశంసా పత్రం, షీల్డ్, రూ.10వేలు, స్పెషల్ బహుమతి గౌతమ్‌కు రూ. 5వేలు, కన్సలేషన్ విజేత సన్యాసిరావుకు రూ.2వేలు ప్రశంస పత్రం, షీల్డను డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర అందజేశారు. కార్యక్రమంలో పాలకొండ ఎమ్మెల్యే కళావతి, లైజన్ ఆఫీసర్ రుగడ శ్రీనివాసరావు ఉన్నారు.

డెంగీ నివారణకు చర్యలు

ప్రజాశక్తి - భామిని
మండలంలోని అత్తికొత్తూరుకు చెందిన ఎస్.సౌజన్య డెంగీబారిన పడినట్టు నిర్ధారణ అయ్యింది. దీంతో ఆ వ్యాధి వ్యాప్తి చెందకుండా నివారణ చర్యలను బాలేరు వైద్యులు డాక్టర్ శివకుమార్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది చేపట్టారు. అనంతరం ఇంటింటి ఫీవర్ సర్వే నిర్వహించారు. మలేరియా ఫాగింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి అప్పారావు, ఇఒపిఆర్‌డి కృష్ణారావు, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు, ఎంపిహెచ్ఇఒ జె.వెంకటరాజు, ఎఎన్ఎం సత్యవతి, హెచ్ రాజు, లక్ష్మి ఉన్నారు.

సుమిత్రాపురంలో గడపగడపకు

ప్రజాశక్తి - సీతానగరం
మండలంలోని పెదంకలాం సచివాలయం పరిధిలో గల సుమిత్రాపురంలో సోమవారం గడపగడప కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ గడప గడపలకు వచ్చిన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించే దిశగా కృషి జరుగుతుందన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి బి.రమణమ్మ, జెడ్‌పిటిసి సభ్యులు ఎం.బాబ్జి, సర్పంచ్ బొత్స నందిని, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

1500 సారా ప్యాకెట్లు స్వాధీనం

ప్రజాశక్తి - పాచిపెంట
ఒడిశా నుండి అక్రమంగా 1500 నాటు సారా ప్యాకెట్లను తరలిస్తున్న పాచిపెంట గ్రామానికి చెందిన ఎడ్ల సన్యాసిని పట్టుకొని సారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఫక్రుద్దీన్ తెలిపారు. ఆయన అందించిన వివరాలిలా ఉన్నాయి. సోమవారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో పాచిపెంటకు చెందిన ఎడ్ల సన్యాసి అనే వ్యక్తి హెూండా యాక్టీవ్‌పై ఒడిశా నుంచి అక్రమంగా 1500 నాటు సారా ప్యాకెట్లను తరలిస్తుండగా పట్టుపడ్డాడని, ఈ మేరకు సారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని వాహనాన్ని సీజ్ చేసి సన్యాసి పై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్సై తెలిపారు.



యువగళం పాదయాత్ర పాల్గొన్న రంజిత్‌కుమార్

యువగళం పాదయాత్రలో కోలా రంజిత్

ప్రజాశక్తి - కురుపాం
టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర సోమవారం సంతనూతలపాడు నియోజకవర్గం మార్కాపురం వద్ద 163వ రోజుకు చేరుకున్న సందర్భంగా స్థానిక టిడిపి తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి కోలా రంజిత్ కుమార్ మర్యాదపూర్వక కలిసి ఆయనతోపాటు పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజక వర్గంలో పార్టీ స్థితిగతులను అడిగి తెలుసుకున్నారన్నారు. .

పెదపెంకి ఉన్నత పాఠశాల సందర్శన

ప్రజాశక్తి - బలిజిపేట
మండలంలోని పెదపెంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంఇఒ-1 సామల సింహాచలం సోమవారం సందర్శించారు. ఐఎఫ్‌పి విద్యా బోధన పరిశీలించి, డిజిటల్ విద్యావిధానం విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరమని, విద్యార్థులు చక్కగా అవగాహన చేసుకోవాలని తెలిపారు. ఆరు, ఏడు తరగతుల విద్యార్థుల వర్క్ బుక్స్ పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థుల కు కండ్ల కళకలు వ్యాధి ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసు కోవాలని చెప్పారు. ఆయన వెంట ఇంచార్జ్ హెచ్ఎం జోగినాయుడు ఉన్నారు.

తప్పుడు ఓటర్ల నమోదుపై చర్యలు చేపట్టండి

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్
నియోజకవర్గంలో వివిధ బూత్‌ల్లో అక్రమంగా నమోదైన ఓటర్లను తొలగించి జాబితాను సరిచేయాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొబ్బిలి చిరంజీవులు సోమవారం డిఆర్ఒ జె.వెంకట్రావుకు ఫిర్యాదు చేశారు. స్పందన కార్యక్రమంలో సంబంధిత జాబితాతో కూడిన వినతి అందించారు. పార్వతీపురం మున్సిపాలిటీ 6,7 వార్డుల్లో ఓటరు వెరిఫికేషన్ జరపగా, ఏడో వార్డులో ఓటర్లను ఆరో వార్డు లోను డోర్ నెం- 248,249,252 తో ఆ ఇంటి ఓటర్ల కాకుండా బయట వ్యక్తులను ఒకరు లిస్ట్‌లో చేర్పించారని తెలిపారు. వినతిని అందజేసిన వారిలో టిడిపి నాయకులు ఎం.వెంకటరమణ, టిఎన్ఎస్ఎఫ్ సభ్యులు కల్కి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి -గరుగుబిల్లి
స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని ఆయా గ్రామాలకు మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేయడం జరుగుతుందని ఎఇ బి.శంకరరావు సోమవారం తెలిపారు. 33 కెవి లైన్ మెయింటినెన్స్ పనులు కారణంగా : విద్యుత్ సరఫరాను నిలుపుదల చేయనున్నామని వినియోగదారులు ఈ విషయమును గమనించాలని ఆయన కోరారు.

మంచినీరు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్
పట్టణంలో మున్సిపల్ కొళాయిల ద్వారా మంచినీరు సరఫరా జరిగేలా చర్యలు చేపట్టాలని జనసేన నాయకులు సోమవారం జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావును కోరారు. జనసేన నాయకులు వి.దాలినాయుడు, అన్నాబత్తుల దుర్గాప్రసాద్ మాట్లాడుతూ గత కొద్దిరోజులుగా మున్సిపల్ కొళాయిల్లో బురద నీరు సరఫరా అవుతుందన్నారు. ఆ నీరు తాగిన ప్రజలు రోగాలతో బాధపడుతున్నారన్నారు. ప్రతి ఏటా వర్షాకాలంలో కుళాయిలో బురద నీరు సరఫరా చేస్తున్నారన్నారని తక్షణమే మంచినీరు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇంకా కొనసా...గుతున్న 'అమ్మఒడి'

నగదు కోసం బ్యాంకులు, వాలంటీర్లు చుట్టూ తల్లుల ప్రదక్షిణలు



అమ్మఒడి డబ్బుల కోసం బ్యాంకు సేవా కేంద్రానికి వచ్చిన గిరిజన మహిళలు

ప్రజాశక్తి - మక్కువ
జగనన్న అమ్మఒడి నాలుగో విడత కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి గత నెల 28న ప్రారంభించారు. అయితే నేటికీ లబ్ధిదారుల ఖాతాల్లోని నిధులు మంజూరు కాక పోవడంతో విద్యార్థుల తల్లులు బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మూడు విడతలకు భిన్నంగా నాలుగో విడత అమ్మఒడి నిధులు విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకి జమవుతూ వస్తున్నాయి. నవరత్నాల హామీలు భాగంగా ప్రారంభంలో విద్యార్థుల తల్లులు ఖాతాల్లో రూ.15వేలు ఒకేసారి జమ చేశారు. ఈసారి నాలుగో విడత విషయానికి వచ్చేసరికి అలాపడిన దాఖలాల్లేవు. ఈ నిధులు కూడా రూ.2వేలు పాతవి మినహాయించి రూ.13వేలే ఆయా తల్లుల ఖాతాలకు జమ చేస్తున్నారు. గతనెల 28వ తేదీన బటన్ నొక్కి తల్లులు ఖాతాలకు జమ చేశానని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బహిరంగ సభలో ప్రకటించారు. అయితే 25 రోజులు కావస్తున్నా ఇంకా సుమారుగా 30శాతం పైబడి మహిళలకు అమ్మబడి నిధులు జమ కావలసి ఉంది. 25 రోజులుగా అమ్మ ఒడి నగదు కోసం లబ్ధిదారులు బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణాలు చేయాల్సిన పరిస్థితి. అలాగే వారి ఖాతాలో డబ్బులు పడలేదని తెలియడంతో వాలంటీర్లు వద్ద కూడా తమ గోడు వెళ్లబోసుకునే స్థితి దాపురించిందని వారు వాపుతున్నారు. అలాగే ఈసారి అమ్మ ఒడి లబ్ధిదారుల ఖాతాల్లో రూ.5వేలు, రూ.6వేలు, రూ.9వేలు చొప్పున జమ కావడం మరో విచిత్రం. ఇప్పటికే చాలామందికి ఇంకా పూర్తిస్థాయి నిధులు వారి ఖాతాల్లోకి జమ కాలేనట్లు తెలుస్తోంది. ఇంకా సమయం ఉందని వాలంటీర్లు చెప్పడంతో విద్యార్థుల తల్లులు ఆశతో ఆత్రంగా బ్యాంకుల వైపు పరుగులు తీస్తున్నారు. ఎందుకిలా చేశారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది ప్రభుత్వం చేపట్టిన అమ్మఒడి నిధులు విడుదలలో కొందరి ముఖంలో మోదం మరికొందరు ముఖంలో ఖేదం కన్పిస్తుంది. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల విద్యార్థుల తల్లిదండ్రులు దూర ప్రాంతాల్లో ఉన్న బ్యాంకులు, మినీ బ్యాంకుల వద్దకు పనులు మానుకొని తిరగాల్సి వస్తుందని వారు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టి సారించి మిగిలిన లబ్ధిదారులందరికీ అమ్మ ఒడి నిధులు వెంటనే జమచేయాలని పలువురు లబ్ధిదారులు కోరుతున్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మంచి ఫలితాలు సాధించాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

ప్రజాశక్తి - పార్వతీపురం
జిల్లాను స్వచ్ఛ సర్వేక్షణ్‌లో అద్భుతమైన ఫలితాలు సాధించేలా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. సోమవారం జగనన్న కు చెబుదాం కార్యక్రమం అనంతరం స్వచ్ఛ సర్వేక్షణ్ గోడ పత్రికను విడుదలచేశారు. స్వచ్ఛ సర్వేక్షణ్, ప్రపంచంలోనే అతిపెద్ద పట్టణ పారిశుధ్య, పరిశుభ్రత సర్వే అని, పట్టణాలు, నగరాల మధ్య ఆరోగ్యకరమైన పోటీ స్ఫూర్తిని పెంపొందించడంలో, పౌరులకు వారి సేవలు మెరుగుపరచడానికి, పరిశుభ్రమైన నగరాలను రూపొందించడంలో ఇది కీలకమైనది అన్నారు. మరుగుదొడ్డిలో కాకుండా బహిరంగ వాతావరణంలో మలవిసర్జన చేయడం మానుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. దీనిపై ప్రజలకు అవగాహనా కల్పించాలని ఆయన తెలిపారు. సంపూర్ణ స్వచ్ఛత వైపు అడుగు వేద్దామని, మన గ్రామాన్ని, జిల్లాను బహిరంగ మలవిసర్జన రహితంగా మార్చుకుందామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో జెసి ఆర్.గోవిందరావు, డిపిఒ బి.సత్యనారాయణ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బగాది జగన్నాథరావు, డ్వామా పీడీ కె.రామచంద్ర రావు, డిఆర్‌డిఎ పీడీ పి.కిరణ్ కుమార్, జిల్లా ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకర రావు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

ప్రజాశక్తి కలెక్టరేట్
కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ జెఎసి ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేసి కలెక్టర్‌కు వినతిని అందజేశారు. అనంతరం జెఎసి నాయకులు బివి రమణ, ఎం.ఈశ్వరరావు మాట్లాడుతూ 2022 డిసెంబర్ 31 నాటికి పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్సోర్స్ ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖలు, సంస్థలు, కార్పొరేషన్లు, ప్రభుత్వ పథకాలు, యూనివర్శిటీలు, టిటిడి వంటి ధార్మిక సంస్థల్లో మూడు లక్షలకు పైగా ఉద్యోగులు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిన అనేక ఏళ్లుగా పనిచేస్తున్నారని, వీరే కాక వివిధ పద్ధతుల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ఎప్పటికైనా తాము రెగ్యులర్ అవుతామన్న ఆశతో అతి తక్కువ వేతనాలతో పని చేస్తున్నారని అన్నారు. గత ఎన్నికల సందర్భంగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులందర్నీ రెగ్యులరైజ్ చేయాలని లేనిచో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు నర్సింహులు ,శాంతలక్ష్మి, పాల్గొన్నారు.

31న కలెక్టరేట్ వద్ద ధర్నా



బలిజిపేటలో ఎంఇఒకు వినతిని అందజేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

ప్రజాశక్తి - సీతంపేట
కనీసవేతనం ఇవ్వాలని, మెనూ ఛార్జీలు ఎంచాలని కోరుతూ మధ్యాహ్నభోజన కార్మికులు ఈనెల 31న కలెక్టరేట్ వద్ద ధర్నా తలపెట్టినట్టు సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు తెలిపారు. ఈ మేరకు స్థానిక సిఐటియు కార్యాలయంలో మధ్యాహ్న భోజన కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు నెలకు రూ.10వేలు వేతనం ఇవ్వాలి, ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచాలని తదితర సమస్యలపై ధర్నా చేయనున్నట్టు తెలిపారు. ఈ ధర్నాలో పెద్దఎత్తున మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఎస్.రోయిబారీ, కె.ఉష, ప్రియదర్శని, వి.చామంతి, ఎ.బుజ్జి, జె.సుధా సిఐటియు సీతంపేట మండల సమన్వయ కమిటీ అధ్యక్షులు ఎస్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని మధ్యాహ్న భోజన కార్మికులు వినతి

బలిజిపేట :తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మధ్యాహ్న భోజన కార్మికులు ఎంఇఒకు సోమవారం వినతిని అందజేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన కార్మికసంఘం నాయకులు భవానీ, యు.లక్ష్మి మాట్లాడుతూ ఈ పథకాన్ని 20ఏళ్లుగా నిర్వహిస్తున్న తమకు ఏ ప్రభుత్వం వచ్చిన మా సమస్యలు పట్టించుకోవడంలేదన్నారు. చాలీచాలని జీతంతో వెట్టిచాకిరి చేస్తున్నామన్నారు. రాజకీయ వేధింపులు ఆపాలని, తొలగించిన తట్టుకోటి గణమ్మను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈనెల ఈనెల 31న కలెక్టరేట్ వద్ద ధర్నా జయప్రదం చేయాలని వారు కోరారు. అనంతరం ఎంఇఒ ఎస్.సింహాచలంకు వినతిని అందజేశారు. కార్యక్రమంలో లక్ష్మి, గౌరమ్మ, రూప, సంతు, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

దుంపలపాడు రోడ్డు పనులు ప్రారంభించాలి

ప్రజాశక్తి - సీతంపేట
మండలంలోని మర్రిపాడు రోడ్డు నుంచి రంగంవలస మీదుగా దుంపలపాడు వరకు గల రోడ్డు పనులను తక్షణమే ప్రారంభించాలని టిడిపి నాయకులు పడాల భూదేవి ఐటిడిఎ పిఒ కల్పనాకుమారిని కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఐటిడిఎలో జరిగిన స్పందన కార్యక్రమంలో పిఒకు వినతిని ఇచ్చిన భూదేవి మాట్లాడుతూ రంగంవలస మీదుగా దుంపలపాడు వరకు గల రహదారి కోసం 2018లో అప్పట్లో టిడిపి ప్రభుత్వం రూ.7.85 కోట్లు మంజూరయ్యాయని, అయితే పనులు ప్రారంభించిన వెంటనే ఎన్నికల కోడ్ కారణంగా నిలిపివేశారన్నారు. నేటికి నాలుగేళ్లయినా ఇప్పటికీ పనులు ప్రారంభించలేదన్నారు. ఇప్పటికైనా స్పందించి తక్షణమే పనులను పున: ప్రారంభించాలని కోరారు. అలాగే లేని భూములు ఉన్నట్లు చూపిస్తున్నారని, అర్హులైన గిరిజన వృద్ధులు కు పింఛన్లు పునరుద్ధరణ చేయాలని కోరారు. ఈమె వెంట రాజీ ఎంపీటీసీ సభ్యులు జయలక్ష్మీ తదితరులు ఉన్నారు

వృద్ధ కళాకారుడికి ఘన సన్మానం

ప్రజాశక్తి - బలిజిపేట
మండలంలో వెంగాపురంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో తుమరాడకు చాకరాపల్లి ఈశ్వరరావుకు ఆ పాఠశాల ఉపాధ్యాయుల సమక్షంలో సోమవారం 90వ సన్మానం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయనకు దుశ్శాలువాలతో సన్మానించి, పుష్పగుచ్ఛాలు అందించారు. అనంతరం ఆయన దేశభక్తి గీతాలు పాడి పిల్లలను, ఉపాధ్యాయులను ఆనందింపజేశారు.

సాగు భూములకు పట్టాలివ్వాలి

ప్రజాశకి - పాచిపెంట
మండలంలోని కొండతాడురులో 113 సర్వే నెంబర్లు సాగు చేస్తున్న గిరిజన భూములకు సాగు పట్టాలు మంజూరు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు పొడి జన్ని వెంకటి, సుర్రు గంగయ్య ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ సాగు చేస్తున్న కొండతాడురు భూములకు పట్టాలు మంజూరు చేయాలని మూడేళ్ల క్రితం చేసిన ఆందోళనకు అధికారులు స్పందించి సర్వేలు చేసి 210 ఎకరాలు భూమిని తేల్చారన్నారు. అయితే వాటికి నేటికీ హక్కులు కల్పించకుండా కాలయాపన చేస్తూ గిరిజనులకు తిప్పుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు సాగు పట్టాలు మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు. అనంతరం తహశీల్దార్ ఎం.రాజశేఖర్‌కు వినతిని అవ్వగా, ఆయన మాట్లాడుతూ ఆర్ఐను, సర్వేయర్‌ను రప్పించి వెంటనే హక్కులు కల్పించేలా ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు పేటూరి చిన్నారావు, పొడి జన్ని సీతారాం, పోలి తల్లి తదితర గిరిజనులు పాల్గొన్నారు.

నాడు-నేడు నిధులపై విచారణ చేపట్టాలి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఐటిడిఎ పిఒ కల్పన కుమారి

ప్రజాశక్తి - సీతంపేట
శ్రీకాకుళం జిల్లా పాతపట్నం మండలం బొమ్మిక ఆశ్రమ పాఠశాలలో నాడు-నేడు నిధులు దుర్వినియోగమయ్యాయని, దీనిపై విచారణ జరిపించాలని గిరిజన ఐక్యవేదిక సంఘం జిల్లా అధ్యక్షులు దివ్వెల లక్ష్మీనారాయణ సోమవారం స్పందనలో పిఒ కల్పనా కుమారి దృష్టికి తీసుకొచ్చారు. ఈ పాఠశాలకు మంజూరైన నిధులు ఖర్చు చేయలేదని, ప్రధానోపాధ్యాయులు తన సొంత ఖర్చులకు వాడుకున్నాడని ఆరోపించారు. నడిమి గోడకు చెందిన అశ్విని చెక్ డ్యామ్ మంజూరు చేయాలని కోరారు. పెద్దూరు సర్పంచ్ ఆదిలక్ష్మి చెక్ డ్యామ్ మంజూరు చేయాలని కోరారు. కోడి పిల్లగూడ చెందిన సుస్మిత అంగనవాడీలో హెల్పర్ పోస్ట్ ఇప్పించాలని కోరారు. కొత్త బాలేరుకు చెందిన సవర చిన్నారి ఆశ కార్యకర్త పోస్ట్ ఇప్పించాలని విన్నవించారు. సోమగండికి చెందిన స్వర్ణకుమారి హౌసింగ్ బిల్లు మంజూరు చేయాలని వినతి సమర్పించారు. జి.గుమ్మడ చెందిన సూర్యారావు ఉపాధి హామీ పని దినాలు పెంచాలని కోరారు. మొగధార గూడకు చెందిన బంగారు సిసి రోడ్డు మంజూరు చేయాలన్నారు. పెద్దూరుకు చెందిన రాజేష్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు మంజూరు చేయాలని కోరారు. జాతపు జగత్‌పల్లి చెందిన మోజేష్ తాగునీరు పైపు మంజూరు చేయాలని కోరారు. ధారపాడు చెందిన రమేష్ బస్ షెల్టర్ మంజూరు చేయాలని విన్నవించారు. ఈ స్పందన కు 151 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో డిడి శ్రీనివాసరావు, ఎపిఒ రోషి రెడ్డి, డిప్యూటీ డిఇఒ ఢిల్లీరాణి, సిడిపిఒ పి.రంగలక్ష్మి, ఎడిఇ తిరుమలరెడ్డి, డిఇ కృష్ణకుమార్, ఎంఒ కోటిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌కె పాడులో మహాశక్తి చైతన్య రథం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం
మండలంలోని ఎల్విన్ పేట పంచాయతీ ఎస్‌కెపాడులో మహాశక్తి చైతన్యరథం కురుపాం నియోజకవర్గ టిడిపి ఇంచార్జి తోయక జగదీశ్వరి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో భవిష్యత్తుకు గ్యారంటీలో భాగంగా ప్రతి కుటుంబానికి రూ.1,22,000 ఆదాయం అందేలా మేనిఫెస్టోను తయారు చేయడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా ఇంటింటికి వెళ్లి టిడిపి ఎన్నికల మేనిఫెస్టోను ప్రజలకు వివరిస్తున్నట్లు ఆమె చెప్పారు. ప్రజల కష్టాలు తీరాలంటే 2024 ఎన్నికల్లో టిడిపిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.

మక్కువ : మండలంలోని చెముడు పంచాయతీలో టిడిపి మహాశక్తి పథకంపై సోమవారం టిడిపి మండల పార్టీ మాజీ అధ్యక్షుడు పెంట తిరుపతిరావు ఆధ్వర్యంలో ఎస్టీ సెల్ ప్రతినిధి హింరిక ప్రసాద్ ముఖ్యఅతిథిగా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఆక్యాన రాము, బొంగు భాస్కరరావు, మూడడ్ల బలరాం, తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్ : మండలం సూడిగాం గ్రామంలో మహాశక్తి ప్రచార కార్యక్రమం మున్సిపల్ మాజీ చైర్పర్సన్, నియోజకవర్గం మహిళా అధ్యక్షులు ద్వారపురెడ్డి శ్రీదేవి ఆధ్వర్యాన జరిగింది. ఈ సందర్భంగా ఆమె టిడిపి మేనిఫోస్టలో అంశాలపై గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు డి మోహన్ రావు, గర్భాపు ఉదయభాను, మాజీ సర్పంచ్ గురజాన చంద్రమౌళి బోను చంద్రమౌళి చంటి, , కౌన్సిలర్ బడే గౌరీ నాయుడు నాయకులు పాలకొండ రాజశేఖర్ శంకర్రావు కార్యకర్తలు పాల్గొన్నారు .

ఉద్యోగికి విద్యుదాఘాతం

న్యాయం చేయాలని ట్రాన్స్‌కో కార్యాలయం ఎదుట బంధువుల ఆందోళన

పోలీసుల చొరవతో సద్దుమణిగిన వివాదం



గాయపడిన శ్రీనివాసరావు

ప్రజాశక్తి-వీరఘట్టం
మండలం కొట్టుగుమ్మడ గ్రామానికి చెందిన గురాన శ్రీనివాసరావు జెఎల్ఎంగా విధులు నిర్వహిస్తూ విద్యుదాఘాతానికి గురై తీవ్ర గాయాల య్యాయి. మండలంలో గడగమ్మ సమీపంలో సోమవారం విద్యుత్ స్తంభాన్ని అమర్చేందుకు జి.శ్రీనివాసరావు నలుగురు కూలీలను వెంటబెట్టుకుని స్తంభం కూలిన చోట కొత్త స్తంభం ఏర్పాటు చేసేందుకు అక్కడకు చేరుకున్నారు. వారం రోజుల క్రితం విద్యుత్ స్తంభం విరిగిపోవడంతో బిటివాడ ఫీడర్ నుంచి చిదిమి, గడగమ్మ, కొట్టుగుమ్మడ, కిమ్మి గ్రామాలకు విద్యుత్ సరఫరా అయ్యేది. ఇది నేలకొరగడంతో ఆ సెక్షన్‌ను నిలుపుదల చేసి కడకెల్ల ఫీడర్ నుంచి సప్లై ఇచ్చారు. లైన్ సప్లై నిలుపుదల చేయాలని సమాచారం ఇవ్వడంతో వైర్లు కట్ చేస్తుండగా మిగిలిన వైర్లు కాలుకు తగాయి. దీంతో ఆయన కేకలు వేయంతో పక్కనే ఉన్న కూలీలు వచ్చి చూసేసరికి శ్రీనివాసరావు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ విషయమై తోటి ఉద్యోగి మజ్జి కృష్ణంరాజుకు స్థానిక సబ్ స్టేషన్‌కు పలుమార్లుఫోన్ చేసినా స్పందించలేదు. అధికారుల నిర్లక్ష్యం వలే ఈ ప్రమాదం జరిగిందని గడగమ్మ, కొట్టుగుమ్మడ గ్రామస్తులు స్థానిక సబ్‌స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. ఆందోళన చేయడంతో మండల మంతా మధ్యాహ్నం 3గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయించారు. తీవ్రగాయాలైన శ్రీనివాసరావును పాలకొండ వరకు తరలించి అక్కడ ప్రథమ చికిత్స అందించి విశాఖలోని ప్రైవేట్ ఆస్పత్రికి మెరుగైన వైద్యం కోసం తరలించారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు. జరిగిన ఘటనకు సంబంధించి ఎఇ సమాధానం చెప్పాలని గ్రామస్తులు పట్టుపట్టడంతో ఎఇ బాలాజీ, ఎడి మోహన్‌చక్రవర్తి, స్థానిక ఎస్ఐ ఎం.వెంకట రమణ, జిఎంవలస ఎస్ఐ పి.అవినాష్ సబ్‌స్టేషన్‌కు చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడి సర్ధిచెప్పడంతో విద్యుత్‌ను పునరుద్ధరించారు. వారికి అధికారులు భరోసా ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

వైసిపి పాలనలో గిరిజనులపై దాడులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం
వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజన యువకులు, మహిళలపై దాడులు రోజురోజుకు పెరుగుతున్నాయని అరకు పార్లమెంట్ టిడిపి ఎస్టీ సెల్ అధికార ప్రతినిధి నందివాడ కృష్ణబాబు ఆవేదన వ్యక్తం చేశారు. వైసిపి ఉన్మాదులు గిరిజన యువకుడిపై మూత్రం పోసి చంపిన ఘటన దారుణమన్నారు. గిరిజన మహిళలపై దాడులు, వేధింపులు జరుగుతున్నా రక్షణ చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. గిరిజన గ్రామాల్లో మద్యం ఏరులైపారడంతో మహిళలకు స్వేచ్ఛ కరువైందన్నారు. గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలకు రక్షణ లేకుండాపోయింది అన్నారు

రాజుల పాలనకు చమర గీతం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం
రానున్న 2024 ఎన్నికల్లో రాజుల పాలనకు చమరగీతం పాడతామని టిడిపి సీనియర్ నాయకులు బిడ్డిక పద్మావతి స్పష్టం చేశారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ కురుపాం నియోజకవర్గంలో 40 ఏళ్ల రాజుల పాలనలో గిరిజన అభివృద్ధి ఎక్కడ కూడా జరగలేదన్నారు. నకిలీ కుల ధ్రువీకరణ పత్రాలతో గిరిజనులను మోసగించి గిరిజనులకు చెందవలసిన రిజర్వేషన్లతో ఎమ్మెల్యేలుగా, మంత్రులుగా కొనసాగారని అన్నారు. విద్య, వైద్యం, తాగునీరు, రహదారులు వంటి మౌలిక సదుపాయాల్లేక గిరిజనులు ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడి ఉన్నారని అన్నారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఈ సారి నిజమైన స్వచ్ఛమైన గిరిజన అభ్యర్థికి ఎమ్మెల్యే టికెట్ కేటాయిస్తారని తెలిపారు. ఆశావాహుల్లో ఎమ్మెల్యే టికెట్ ఎవరికి వచ్చినా కలిసికట్టుగా పనిచేసి కురుపాం నియోజకవర్గంలో తెలుగుదేశం జెండా ఎగుర వేస్తామని తెలిపారు.

నేరాలు ఘోరాలు

భార్య ముఖంపై వేడి నీళ్లు పోసిన భర్త

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్
పట్టణంలోని నెయ్యిని వీధికి చెందిన తాడంగి దమయంతి అనే మహిళపై ఆమె భర్త వేడి నీళ్ల పోసి గాయపరిచిన సంఘటన సోమవారం జరిగింది. దమయంతికి 17 ఏళ్ల క్రితం ప్రసాదుతో వివాహమైంది. గత నాలుగేళ్లుగా ఆమెపై అనుమానంతో గొడవపడి ఒకే ఇంటిలో ఉంటున్నప్పటికీ వేర్వేరుగా ఉంటున్నారు. జీవనోపాధి కోసం ఆమె టీ కొట్టు పెట్టుకొని పిల్లల్ని చదివిస్తోంది. ఆమెతో ప్రతిసారి భర్త ఏదో గొడవ పెట్టుకోవడం పరిపాటిగా మారింది. ఈ క్రమంలో సోమవారం ఉదయం ఆమె టీ కొట్టు దగ్గరికి వెళ్లి ఆమె ప్రవర్తనను శంకిస్తూ కోపంతో మరుగుతున్న నీళ్లను ఆమె మొఖం పైకి జల్లడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటనలో వారి కుమార్తె పవిత్రతో పాటు ప్రసాద్‌కు కూడా స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న దమయంతి తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయడంతో ఆమెను జిల్లా ఆసుపత్రికి తరలించగా, వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఘటనపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

ఫ్లైఓవర్ వద్ద వృద్ధుడి మృతదేహం

పార్వతీపురంరూరల్ : స్థానిక టౌన్ రైల్వే స్టేషన్ సమీపాన గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు.. సుమారు 65 సంవత్సరాలు గల వృద్ధుడు ఫ్లైఓవర్ కింద మృతి చెంది ఉన్నాడని స్థానికులు తెలిపారు. మతిస్థిమితం లేక ఈ పరిసర ప్రాంతాల్లో ఎక్కువగా ఆయన తిరుగుతూ ఉండేవాడిని చెప్తున్నారు. వ్యక్తి ఆచూకీ గుర్తించినవారు టౌన్ పోలీస్ స్టేషన్లో సంప్రదించాలని ఎస్ఐ దినకర్ తెలిపారు.

బ్యాంకు చోరీకి విఫలయత్నం

పార్వతీపురంరూరల్ : స్థానిక సెంట్రల్ బ్యాంక్‌లో చోరీకి దుండగులు ప్రయత్నించి విఫలమైన సంఘటన జరిగింది. పోలీసులు వివరాల ప్రకారం శని, ఆదివారాలు బ్యాంకులకు సెలవు కావడాన్ని అదునుగా భావించిన కొంతమంది దుండగులు గ్యాస్ కట్టర్ల సాయంతో కిటికీలు తొలగించి లోపలికి చొరబడ్డారు. బ్యాంకు లాకర్ను తొలగించేందుకు ప్రయత్నంలో విఫలం కావడంతో దుండగులు పరారీలో ఉన్నారన్నారు. సంఘటన విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీజిల్లా విక్రాంత్ పాటిల్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి వివరాలు పూర్తిగా తెలుసుకున్నారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు వెల్లడించారు.

పరస్పర దాడుల్లో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్
నర్సిపురం గ్రామానికి చెందిన మొగిలి శంకరరావు అనే తాపీ మేస్త్రి కి, వెంకంపేట గ్రామానికి చెందిన మొగడ గణపతి అనే సెంట్రింగ్ మేస్త్రికి మధ్య సోమవారం జరిగిన గొడవలో ఇరువురు పరస్పరం దాడి చేసుకుని గాయాలు పాలయ్యారు. ఒకరిపై ఒకరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసుకోవడంతో రూరల్ పోలీసులు ఇద్దర్నీ జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

173 లీటర్ల సారా నేలమట్టం

ప్రజాశక్తి - సీతంపేట
పాలకొండ డీఎస్పీ కష్ణారావు సమక్షంలో 173.5 లీటర్ల నాటుసారాను నాశనం చేశారు. ఈ నాటుసారాను ఇంతకుముందు 13 కేసుల్లో పట్టుకొని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై నీలకంఠ రావు తెలిపారు. డీఎస్పీ సమక్షంలో నేలమట్టం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాలకొండ ఎస్సై శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.